క్లుప్తంగా

అలజంగిలో పొలంబడి



మందులు వేసే సమయంలో అనారోగ్యానికి గురైతే తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తున్న ఏడీఏ శ్యామ్‌సుందర్

బొబ్బిలి రూరల్: మండలంలోని అలజంగిలో శనివారం డాక్టర్ వైఎస్సార్ పొలంబడి నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ ఏడీఏ ఎం. శ్యామ్‌సుందర్ మాట్లాడుతూ, అపరాల పంటలకు తెగుళ్లు ఆశిస్తున్నాయని, రైతులంతా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఈ సందర్భంగా తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకురాలు పెంట లత, తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత భూహక్కు పత్రాల పంపిణీ



రైతులకు పత్రాలు పంపిణీ చేస్తున్న వీఆర్వో లలిత

బొబ్బిలి రూరల్: సమగ్ర భూ రీసర్వే పూర్తయిన గ్రామాలలో రైతులకు శాశ్వత భూహక్కు పత్రాలు పంపిణీ చేస్తున్నారు. ఇందులో భాగంగా మండలంలోని దిబ్బగుడ్డివలసలో రైతుల వేలిముద్రలు తీసుకుని రైతులకు వీఆర్ఓ లలిత శనివారం భూహక్కు పత్రాలు పంపిణీ చేశారు.

చట్టాలపై అవగాహన

• ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సరోజనమ్మ



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి

బొబ్బిలి: చట్టాలపై అందరూ అవగాహన పెంపొందించుకోవాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.సరోజనమ్మ సూచించారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఐటీఐలో నిర్వహించిన న్యాయ అవగాహనసదస్సులో ఆమె మాట్లాడుతూ, మారుతున్న సమాజంలో ఎదుగుతున్న యువత చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని, సమాజంలో జరుగుతున్న మార్పులను ఎప్పటికప్పుడు గుర్తించి అప్‌డేట్ కావాలన్నారు. ఎవరి వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలగకుండా చట్టపరిధిని అతిక్రమించకుండా జీవించాలని సూచించారు. సదస్సులో సీనియర్ అడ్వకేట్ సీహెచ్ఎల్‌వీ ప్రసన్నకుమార్, ఐటీఐ ప్రిన్సిపాల్ కె.సూర్యారావు, తదితరులు పాల్గొని పలు అంశాలపై అవగాహన కల్పించారు.

రూ.3 లక్షలతో సీసీ కాలువల నిర్మాణం

రాజాం: మండలంలో కంచరాం గ్రామంలో గోరువీధిలో రూ.3 లక్షలు అంచనా వ్యయంతో సీసీరోడ్డుతో పాటు మురుగుకాలువ నిర్మాణం చేపడుతున్నట్లు పంచాయతీ సర్పంచ్ గెద్దాపు సుబ్బమ్మ అన్నారు. గ్రామంలో చేపడుతున్న పనులను శనివారం పరిశీలించారు. పంచాయతీకి ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. పంచాయతీరాజ్ జేఈ ప్రభాకరరావు, వైఎస్సార్‌సీపీ నేత గెద్దాపు అప్పలనాయుడు, పంచాయతీ కార్యదర్శి దిలీప్‌కుమార్ డ్రైనేజీ నిర్మాణ పనులను పర్యవేక్షించారు.

గృహ ఆధారిత విద్య అందించాలి

తెర్లాం: ప్రత్యేక అవసరాలు గల హోం బేస్డ్ పిల్లలకు గృహ ఆధారిత విద్యను సహిత విద్య ఉపాధ్యాయులు అందించాలని మండల విద్యాశాఖాధికారి జె.త్రినాథరావు అన్నారు. సహిత విద్యా విభాగం ద్వారా 'గృహ ఆధారిత విద్య – పరిశీలన కార్యక్రమంలో భాగంగా మండలంలోని సింగిరెడ్డివలసలో ఎం.యామిని అనే విద్యార్థిని ఇంటికి శనివారం వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థిని ఆరోగ్య, మానసిక, శారీరక పరిస్థితిని తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మండల ఐఈఆర్‌టీ సూర్యారావు, తదితరులు పాల్గొన్నారు.

తూనిక తప్పనిసరి

• తహసీల్దార్ రాజేశ్వరరావు



మాట్లాడుతున్న తహసీల్దార్ దోల రాజేశ్వరరావు

తెర్లాం: మండలంలోని అన్ని రేషన్ దుకాణాల డీలర్లంతా ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి రేషన్ బియ్యం తీసుకువెళ్లేటప్పుడు తప్పనిసరిగా ఎలక్ట్రానిక్ తూనిక యంత్రంపై తూనిక వేసి తీసుకెళ్లాలని తహసీల్దార్ డోల రాజేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సీఎస్‌డీటీ గాడి భాస్కరరావు అధ్యక్షతన డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ, ప్రతి నెలా రేషన్ డిపోల ద్వారా ఎండీయూ వాహనాలకు బియ్యం వేసేటప్పుడు తప్పనిసరిగా బియ్యం బస్తాలను తూనిక వేసి ఆపరేటర్లకు వేయాలన్నారు. బియ్యం తూనికలో తేడాలు ఉన్నాయని ఫిర్యాదులొస్తే డీలర్లపై చర్యలు తప్పవన్నారు.

ఘనంగా రథసప్తమి



తెర్లాం: వేంకటేశ్వరస్వామి ఆలయంలో రథసప్తమి సందర్భంగా పూజలు చేస్తున్న అర్చకుడు



రాజాం సిటీ: స్వామివారి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు



రేగిడి: పనసలవలస రాజవేణుగోపాలస్వామి ఆలయంలో రథసప్తమి పూజలు



బొబ్బిలి: ఆదిత్యవాహనంపై ఊరేగుతున్న వేణుగోపాలుడు

తెర్లాం: మండలంలోని పలు గ్రామాల్లోని ఆలయాల్లో రథసప్తమి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. తెర్లాం, గంగన్నపాడు గ్రామాల్లోని వేంకటేశ్వరస్వామి ఆలయాలతో పాటు పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేపట్టారు. వేంకటేశ్వరస్వామి ఆలయంలో మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో..

బొబ్బిలి రూరల్: మండలంలోని పలు దేవాలయాలతో పాటు వేగావతి నది పరీవాహక ప్రాంతాలైన పెంట, అలజంగి, కారాడ, పారాది, తదితర గ్రామాలలో రథసప్తమి పూజలు ఘనంగా నిర్వహించారు. పలు ఆలయాలలో ఆదిత్యుని పూజలు నిర్వహించిన భక్తులు సూర్యనమస్కారాలు చేశారు. కొత్త పెంట శివాలయంలో ఆదిత్యుని కిరణాలు ఆలయ మూలవిగ్రహాన్ని తాకగా.. ఆ సుందర దృశ్యాన్ని భక్తులు చూసి పులకించారు.

ఊరేగింపు..

బొబ్బిలి: పట్టణంలోని పలు దేవాలయాలలో రథసప్తమి పూజలు ఘనంగా నిర్వహించారు. వేణుగోపాలస్వామిని ఆదిత్య వాహనంపై ఊరేగించి, ప్రత్యేక పూజలు చేపట్టారు. వివిధ గ్రామాల్లోని దేవాలయాలలో సూర్యదేవునికి భక్తిశ్రద్ధలతోపూజలు నిర్వహించారు.

రేగిడి: మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పనసలవలసలో శ్రీరాజవేణుగోపాలస్వామి ఆలయంలో ఆధ్యాత్మిక గురువు తిరుమల రంగనాథం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

రాజాం సిటీ: పట్టణంతోపాటు మండలంలోని అన్ని గ్రామాల్లో రథసప్తమి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని గాయత్రీమాత ఆలయ ప్రాంగణంలో ఉన్న సూర్యనారాయణ స్వామి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ ధర్మకర్త కొండవేటి వివేకానందరావు ఏర్పాట్లు చేశారు.

రాజాం: మండలంలో అంతకాపల్లి గ్రామం వద్ద వెలసిన వెంకటేశ్వరస్వామి ఆలయంలో రథసప్తమి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం స్వామివారికి పల్లకీసేవ నిర్వహించారు.

పేదలందరికీ పక్కా ఇళ్లు



రాజాం సిటీ: గడిముడిదాంలో హౌసింగ్ డే కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ సులోచన

రాజాం సిటీ: ఇల్లులేని ప్రతి పేదవాడి సొంతింటి కల నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిదేనని ఎంపీపీ లావేటి సులోచన అన్నారు. మండలంలోని గడిముడిదాం గ్రామంలో హౌసింగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన పేదలకు వారి సొంత ఊర్లోనే ఇళ్ల స్థలాలు కేటాయించడం జరిగిందన్నారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసి సామూహిక గృహ ప్రవేశాలకు సిద్ధం కావాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, ఎంపీడీఓ బాసూరి శంకరరావు, హౌసింగ్ ఏఈ ఆర్.వేణుగోపాలరావు, ఈఓపీఆర్డీ వి.శ్రీనివాసరావు, ఏపీ ఓ కె.సాయిరాం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంతకవిటి: మండలంలో మంతిన గ్రామంలో శనివారం హౌసింగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. జగనన్న లేఅవుట్ వద్ద ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమాన్ని వివరించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ కనకరాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

బొబ్బిలి రూరల్: మండలంలోని గున్నతోటవలస వద్ద గల మాతృశ్రీ నిలయంలో మహిళలకు ఉచితంగా నెల రోజుల పాటు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ అందిస్తామని అభిమాని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రెడ్డి రాజగోపాలనాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 11 నుంచి మొదటి బ్యాచ్ ప్రారంభిస్తామని, బ్యాచ్‌కు 50 మందికి ఉంటారని పేర్కొన్నారు. ఈనెల 31లోగా బయోడేటాలు తమకు అందించాలని, వయసుతో సంబంధం లేదని తెలిపారు.

ఎంఈఓ త్రినాథరావుకు సన్మానం



ఎంఈఓ త్రినాథరావును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

తెర్లాం: గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా జిల్లా స్థాయిలో ఉత్తమ మండల విద్యాశాఖాధికారిగా ఎంపికై కలెక్టర్ సూర్యకుమారి చేతుల మీదుగా అవార్డు అందుకున్న ఎంఈఓ త్రినాథరావును పలువురు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘ నాయకులు శనివారం సన్మానించారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మంటపంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ, అంకితభావంతో పనిచేసే త్రినాథరావు భవిష్యత్‌లో మరిన్ని అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు.

చిరుధాన్యాలతో ఆహార భద్రత



చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పిస్తున్న రమణారావు

సంతకవిటి: నిత్యం పండించే వరి, గోధుమలతో పోలిస్తే చిరుధాన్యాల సాగుతో ఆహార భద్రత, రైతుకు ఆదాయం చేకూరుతుందని డీసీసీబీ మాజీ చైర్మన్ ఎస్‌వీ రమణారావు అన్నారు. శనివారం హొంజరాం గ్రామంలో చిరుధాన్యాల దినోత్సవం నిర్వహించారు. చిరుధాన్యాల్లో పోషకాలు సమృద్ధిగా ఉండడంతో ఇటీవల కాలంలో వీటి వినియోగం బాగా పెరిగిందన్నారు. రైతులు ప్రత్యామ్నాయ పంటలుగా వీటిని సాగు చేస్తే మంచి లాభాలు వస్తాయని సూచించారు. రైతు భరోసా కేంద్రాలు ద్వారా రైతులకు కావాల్సిన అన్ని రకాల విత్తనాలు అందిస్తున్నామన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఓ పైల నవీన్‌కుమార్, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వికాస తరంగణిలో సూర్యనమస్కారాలు

రాజాం: పట్టణంలో వికాసతరంగణి కార్యాలయంలో శనివారం రథసప్తమి సందర్భంగా సూర్యనమస్కారాలు చేశారు. సంస్థ సమన్వయకర్త అమనాన నీలకంఠం భక్తులతో సూర్యనమస్కారాలు, ఆదిత్య స్తోత్ర పారాయణం చేపట్టారు. సూర్యనమస్కారాలు యోగాసనాల్లో ఒక భాగమని, ప్రతీ రోజు చేస్తే ఆరోగ్యవంతంగా జీవనం సాగించవచ్చన్నారు. కార్యక్రమంలో వికాసతరంగణి కోశాధికారి వాకచర్ల పైడిరాజు, ప్రజ్ఞవికాస్ సమన్వయకర్త మురపాక గణేష్, సంస్కార వికాస్ సమన్వయకర్త గడే అప్పలనాయుడు, సూర్యప్రకాష్, మన్మథ తదితరులు పాల్గొన్నారు.



సూర్యనమస్కారాలు చేస్తున్న వికాస తరంగణి సభ్యులు

బాల్య వివాహాలకు దూరం



అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ విజయకుమారి, ప్రిన్సిపాల్ శారద

బొబ్బిలి: బాల, బాలికలు బాల్య వివాహాలకు దూరంగా ఉండాలని ఐసీడీఎస్ అర్బన్ సీడీపీఓ విజయకుమారి పిలుపునిచ్చారు. పట్టణంలోని అభ్యుదయ, సూర్య పబ్లిక్ పాఠశాలల్లో శనివారం సఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకుని, వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం సైబర్ నేరాలు, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై వివరించారు. కార్యక్రమంలో అభ్యుదయ, సూర్య పాఠశాలల ప్రిన్సిపాళ్లు శారద, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి ఉపయోగపడే పనులు చేయించాలి



రామభద్రపురం: ఇట్లామామిడిపల్లిలో ఉపాధి వేతనదారులకు సూచనలు చేస్తున్న ఎంపీడీఓ రమామణి

• ఎంపీడీఓ రామకృష్ణ

తెర్లాం: ఉపాధి హామీ పథకం ద్వారా వ్యవసాయానికి ఉపయోగపడే పనులు చేయించాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ అన్నారు. మండలంలోని గంగన్నపాడు గొడిచెరువులో జరుగుతున్న ఉపాధి పనులను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ నెల 17న ఇదే చెరువులో జరుగుతున్న పనులను పరిశీలించిన ఎంపీడీఓ పనులపై పలు సూచనలు, సలహాలు చేశారు. అవి ఎంతమేరకు పాటిస్తున్నారో తెలుసుకొనేందుకు మళ్లీ అదే చెరువులో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వేతనదారుల మస్టర్లను తనిఖీ చేశారు. రోజుకు 257 రూపాయల వేతనం గిట్టుబాటయ్యేలా పనులు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు.

సద్వినియోగం చేసుకోవాలి..

రామభద్రపురం: గ్రామంలో చేపట్టే ఉపాధి పనులను వేతనదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రమామణి సూచించారు. మండలంలోని ఇట్లామామిడిపల్లిలో చేపడుతున్న ఉపాధి పనులను ఏపీఓ సుశీలతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా వేతనదారులకు పలు సూచనలు చేశారు. ప్రతి రోజూ ఉదయం ఆరు నుంచి 11 గంటల వరకు పనులు చేపట్టాలన్నారు.

హెల్మెట్ ధరించాలి

రామభద్రపురం: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై సురేంద్ర నాయుడు అన్నారు. మండలంలోని ప్రధాన కూడళ్లలో సిబ్బందితో కలిసి ఆయన వాహన తనిఖీలు నిర్వహించడంతో పాటు రోడ్డు భద్రత నిబంధనలు, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. నిర్లక్ష్యంగా వాహనం నడిపినా, మద్యం మత్తులో ఉన్నా ప్రమాదాలు తప్పవన్నారు.

సంక్షిప్తంగా...

ప్రకృతి సాగు విధానం లాభదాయకం

వంగర: కింజంగి గ్రామంలో రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ విధానంపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏపీఎం బాసిన గోవిందరావు మాట్లాడుతూ.. ఈ విధానంలో పంటలు సాగు చేయడం ద్వారా తక్కువ ఖర్చు, అధిక దిగుబడి, ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులు పొందవచ్చన్నారు. ర అనంతరం అగ్నిఅస్త్రం తయారీని వివరించారు.

రోజుకు రూ.257 వేతనం

రేగిడి: ఉపాధి వేతనదారులు ఇచ్చిన కొలతల మేరకు పనులు పూర్తిచేస్తే రోజుకు రూ.257 వేతనం గిట్టుబాటు అవుతుందని ఏపీఓ ఎస్.హరనాథ్ అన్నారు. మండలంలోని తునివాడ గ్రామంలోని పల్లెవాని చెరువులో చేపట్టిన ఉపాధి పనులను శనివారం ఆయన పరిశీలించారు. వేతనదారుల మస్తర్లను తనిఖీ చేశారు. రెండు పూటలా పని చేయాలని, జాబ్‌కార్డు ఉన్నవారు మాత్రమే పనులకు హాజరుకావాలని సూచించారు. ఫీల్డ్ అసిస్టెంట్ రాజు ఉన్నారు.

ఖైదీల హక్కులపై అవగాహన

బొబ్బిలి రూరల్: పట్టణంలోని సబ్‌జైల్‌లో ఖైదీల హక్కులపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ సౌమ్యజోసఫ్ మాట్లాడుతూ, శిక్ష అనుభవిస్తున్న వారంతా హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు సీహెచ్ఎల్‌వీ ప్రసన్నకుమార్, లక్ష్మీ దీపవల్లి పాల్గొన్నారు.

మజ్జిగౌరమ్మ ఆలయ ప్రతిష్ఠోత్సవం

సంతకవిటి: మందరాడ గ్రామంలో నూతనంగా నిర్మించిన మజ్జిగౌరమ్మ ఆలయ ప్రతిష్ఠోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. గ్రామ పురోహితులు పులఖండం శ్రీనివాసశర్మ పర్యవేక్షణలో వేద మంత్రాల మధ్య తొలిరోజు అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. గ్రామానికి చెందిన వావిలపల్లి నందీశ్వరరావు దంపతులు, గ్రామస్తులు ఈ ప్రతిష్ఠా కార్యక్రమాన్ని చేపడుతున్నారు.

జంతువులను సంరక్షించడం మనందరి బాధ్యత

బాడంగి: మూగజీవాలను సంరక్షించడం మనందరి బాధ్యతని బాడంగి, వాడాడ పశువైద్యాధికారులు వి.గోవింద్, రాధిక అన్నారు. మండలంలోని వాడాడ హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడుతూ, జంతువుల పట్ల ప్రేమతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో వీరితో పాటు హెచ్ఎం విశాలక్షి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యాపారాభివృద్ధికి మెలకువలు తప్పనిసరి

రాజాం సిటీ: స్వయంశక్తి సంఘాల్లోని మహిళలు వ్యాపారాభివృద్ధికి మెలకువలు పాటించాలని వెలుగు ఏసీ ఎ.చిరంజీవి అన్నారు. స్థానిక వెలుగు మండల సమాఖ్య కార్యాలయంలో క్లస్టర్ పరిధిలోని ఐదు మండలాల సీడ్ కాపిటల్ లబ్ధిదారులకు శనివారం ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫుడ్ ప్రాసెసింగ్ చేస్తున్న లబ్ధిదారులు తమ ఉత్పత్తులను చక్కగా ప్యాకింగ్ చేస్తే మార్కెట్‌లో మంచి ధర లభిస్తుందన్నారు. సంఘ మహిళలు చిన్నచిన్న వ్యాపారాలతో మొదలుపెట్టి అంచెలంచెలుగా అభివృద్ధి చెందాలని, తద్వారా మరింత మందికి ఉపాధి కల్పించేందుకు వీలుంటుందని అన్నారు. అటువంటి వారిని ప్రోత్సహించేందుకు పీఎంఎఫ్ఎంఎఫ్ ద్వారా ప్రభుత్వం రుణ సదుపాయంతో పాటు 35 శాతం రాయితీ కల్పిస్తోందన్నారు. కార్యక్రమంలో ఫుడ్ కార్పొరేషన్ ట్రైనీ జ్యోత్స్న, ఏపీఎం టి.దదికుమార్, శేషగిరి, ఎల్‌సీ ఏపీఎం అప్పలనాయుడు, సీసీలు పాల్గొన్నారు.

గడప గడపలో సంక్షేమ కాంతులు..

• డిప్యూటీ సీఎం రాజన్నదొర



పీఎంసీ చైర్మన్ లక్ష్మునాయుడుకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి రాజన్నదొర



ఎస్సీ కాలనీ రోడ్డును పరిశీలిస్తున్న మంత్రి, తదితరులు

మెంటాడ: ప్రతి గడపలో సంక్షేమ వెలుగులు నింపుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని డిప్యూటీ సీఎం, గిరిజనశాఖా మాత్యులు పీడిక రాజన్నదొర అన్నారు. మండలంలోని బడేవలసలో మూడో రోజులో భాగంగా శనివారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్తూ సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు సంక్షేమ పథకాలను సక్రమంగా అందిస్తున్నదీ, లేనిదీ అడిగి తెలుసుకున్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి అవినీతిరహిత పాలన అందిస్తుడండంతో టీడీపీ నాయకులు ఓర్వలేక అసత్య ప్రచారాలకు దిగుతున్నారని ఆరోపించారు. ప్రతిపక్షాల తీరును ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్న ముఖ్యమంత్రి జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని కోరారు.

రహదారి సౌకర్యం కల్పించండి

రహదారి సౌకర్యం కల్పించాలని బడేవలస ఎస్సీ కాలనీవాసులు మంత్రి రాజన్నదొరను కోరారు. దీంతో ఆయన వెంటనే స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

వైఎస్సార్‌సీపీలోకి పీఎంసీ చైర్మన్..

పేరెంట్స్ మానిటరింగ్ కమిటీ చైర్మన్, టీడీపీ నాయకుడు చాపాన లక్ష్మునాయుడు తన అనుచరులతో కలిసి మంత్రి సమక్షంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మునాయుడు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలందరికీ సంక్షేమ ఫలాలను అందించి ఆదుకుంటున్నారని తెలిపారు. పాలన నచ్చి పార్టీలోకి చేరినట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ మీసాల పార్వతి, ఎంపీటీసీ సభ్యురాలు సువ్వాని విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

లోకేష్‌ది లక్ష్యం లేని ఆవేశం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

• ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: పులిని చూసి నక్కలు వాతలు పెట్టుకున్నట్లు టీడీపీ నేత నారా లోకేష్ వ్యవహారం కనిపిస్తోందని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. రాజాంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద శనివారం మీడియా సమావేశం నిర్వహించారు. అప్పట్లో టీడీపీ అరాచకాలు ఎండగట్టడంతో పాటు రాష్ట్ర ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ఒక లక్ష్యంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప యాత్ర చేశారని, ఇప్పుడు నారా లోకేష్ ఎందుకు పాదయాత్ర చేస్తున్నారో తెలియని పరిస్థితిలో ఆ పార్టీ క్యాడర్ ఉందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో ప్రజలకు ఏమీ చేయకుండా, ప్రజా ధనాన్ని దోచుకున్న ఆ పార్టీ నేతలు ఏమి చెప్పి ఇప్పుడు ప్రజలను నమ్మిస్తారని ప్రశ్నించారు. అధికారం కోసం యాత్రలు చేస్తే అవి ఫలితాలు ఇవ్వవని, ప్రజలు అవకాశం ఇచ్చినప్పుడు వారి ఆకాంక్షలకు అనుగుణంగా పాలన అందిస్తే ప్రజలే గౌరవిస్తారని పేర్కొన్నారు. లేనిపోని ఆవేశాలకు పోయి టీడీపీ నేతలు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు. ప్రజలు టీడీపీని నమ్మే పరిస్థితిలో లేరన్నారు. సమావేశంలో పార్టీ రాజాం కన్వీనర్లు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడు, పొట్నూరు లక్ష్మణరావు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, వంగర మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు తదితరులు పాల్గొన్నారు.

వేసవి నాటికి పూర్తిస్థాయిలో తాగునీటి సరఫరా



జల్‌జీవన్ మిషన్ పనుల వివరాలు వెల్లడిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీచరణ్

రేగిడి: ప్రతీ ఇంటికి కుళాయి ద్వారా స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే ఉద్దేశంతో జల్ జీవన్ మిషన్ కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని, ఈ ఏడాది వేసవి నాటికి మండలంలోని అన్ని గ్రామాలకు తాగునీరు అందించేందుకు చర్యలు చేపడుతున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జి.శ్రీచరణ్ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తాగునీటిపై జరిగిన చర్చలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీచరణ్ మాట్లాడుతూ.. మండలంలోని 13 గ్రామాల్లో జల్ జీవన్ మిషన్ పనులు పూర్తిచేసి కుళాయిల ద్వారా ఇంటింటికీ పూర్తిస్థాయిలో తాగునీరు అందిస్తున్నామన్నారు. మరో నాలుగు గ్రామాల్లో పనులు జరుగుతున్నాయని, మిగిలిన గ్రామాల్లో రూ.36 కోట్లతో పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. వ్యవసాయశాఖపై జరిగిన చర్చలో ఏఓ జి.మురళీకృష్ణ మాట్లాడుతూ మండలంలో 24వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం కాగా, ఇప్పటివరకు ఆర్‌బీకేల ద్వారా 12వేల మెట్రిక్ టన్నులు సేకరించినట్లు చెప్పారు. రైతుల వద్ద ఉన్న ధాన్యం, వరి కుప్పల ఫొటోలు తీసి సివిల్‌సప్లై యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నట్లు తెలిపారు. ఉపాధిహామీపై జరిగిన చర్చలో ఏపీఓ ఎస్.హరనాథ్ మాట్లాడుతూ.. అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు ప్రారంభించినట్లు చెప్పారు. కొన్ని శాఖల అధికారులు సమావేశానికి గైర్హాజరు కావడంతో ఆయా అధికారులకు నోటీసులు పంపించాలని వైస్ ఎంపీపీలు అచ్చెన్నాయుడు, జగన్మోహనరావు ఎంపీడీఓ జి.కాశీవిశ్వనాథరావుకు సూచించారు. సమావేశంలో తహసీల్దార్ టి.కల్యాణచక్రవర్తి, సీడీపీఓ సిమ్మాలమ్మ, రేగిడి పశువైద్యాధికారి దుర్గాప్రసాద్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండండి..

• ఎంపీడీఓ భాస్కరరావు, సీడీపీఓ విజయలక్ష్మి



అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ అల్లు భాస్కరరావు

బొబ్బిలి రూరల్: బాలికలు అన్ని విషయాలపై అవగాహన పెంపొందించుకుని అప్రమత్తంగా వ్యవహరించాలని ఎంపీడీఓ అల్లు భాస్కరరావు, ఐసీడీఎస్ రూరల్ సీడీపీఓ విజయలక్ష్మి సూచించారు. మండలంలోని నారసింహునిపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో సఖి కార్యక్రమంపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, ఏఎన్ఎంలు పాఠశాలలు, గ్రామాలలో పర్యటించి యుక్తవయసులో ఉన్న బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత, నెలసరి సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని సూచించారు. దిశా చట్టంతో పాటు మహిళా రక్షణ చట్టాలు, మహిళలు, బాలికలు, యువత రక్షణకు ఏర్పాటైన టోల్‌ఫ్రీ నంబర్లతో పాటు గుడ్/బ్యాడ్ టచ్‌పై బాలికలు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం చంద్రమౌళి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అలాగే పక్కి, అలజంగి, పెంట గ్రామాలలో సఖి కార్యక్రమాలు నిర్వహించారు.

ఆరోగ్యంపై శ్రద్ధ

తెర్లాం: సఖీ గ్రూపుల్లోని కిశోర బాలికలంతా విద్య, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సచివాలయ మహిళా పోలీసులు సూచించారు. స్థానిక ఐదో అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన సఖీ సమావేశంలో వారు మాట్లాడుతూ, గుడ్/బ్యాడ్ టచ్, దిశ, పోక్సో చట్టం, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సచివాలయ మహిళా పోలీస్ తులసి, అంగన్‌వాడీ కార్యకర్తలు వై.శ్రీదేవి, సునీత, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి గృహసారథులే కీలకం



మాట్లాడుతున్న ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు

• ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు

రామభద్రపురం: పార్టీ బలోపేతానికి గృహసారథులే కీలకమని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించడంతో పాటు పార్టీకి సంబంధించిన ప్రతి అంశాన్నీ ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత సచివాలయ కన్వీనర్లు, గృహసారథులదేనని తెలిపారు. వెంటనే గృహ సారథుల నియామక ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ డబ్ల్యూఎస్ రాయులు, మండల సచివాలయ కన్వీనర్ చింతల సింహాచలం నాయుడు, మండల బూత్ కమిటీ చైర్మన్ పత్తిగుళ్ల ఏక్‌నాథ్, తదితరులు పాల్గొన్నారు.